సాక్షి కర్నూలు
ఆదివారం । 9 । మార్చి । 2025



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావే దికపై శనివారం కడపకు చెందిన సాయి నటరాజ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణకు శనివారం గుంటూరుకు చెందిన పి.కోటేశ్వరరావు రూ.1,01,116, ఒంగోలుకు చెందిన చింతపల్లి అంజలి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.

ఉష్ణోగ్రతలు

కనిష్ఠం	20.1
గరిష్ఠం	39.4

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:08
ఆదోని	సా॥ 6:31	ఉ॥ 5:09
నంద్యాల	సా॥ 6:29	ఉ॥ 5:08
ఆత్మకూరు	సా॥ 6:28	ఉ॥ 5:02
బనగానపల్లె	సా॥ 6:31	ఉ॥ 5:04

హదీస్ వెలుగు :

రోజా దీక్ష ఉండి హలాల్ ఆహారంతోనే ఇఫ్తార్ చేయండి. హరామ్ ఆహారంతో ఇఫ్తార్ చేస్తే పగలంతా పస్తు ఉండటం తప్ప పుణ్యం లభించదు.

- పవిత్ర ఖురాన్

బిల్లుల్లో తిరకాసు!

ముట్టుకుంటే షాక్

- విద్యుత్ వినియోగదారుల నిలువు దోపిడీ
- 2022, 2023, 2025 సంవత్సరాల్లో వాడిన విద్యుత్‌కు ప్రతి యూనిట్‌పై 40పైసల వడ్డింపు
- ట్రూ అప్ చార్జీలతో మరో అదనపు భారం
- బిల్లులను చూసి బెంబేలెత్తుతున్న ప్రజలు



కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలపై టీడీపీ, జనసేనలు చేసిన దుష్ప్రచారం అంతాఇంతా కాదు. అడ్డుగోలుగా చార్జీలు పెంచి మోయలేని భారం వేస్తున్నారని ప్రజలను నమ్మించి ఎన్నికల్లో లబ్ధి పొందడం తెలిసిందే. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం మోపం, చార్జీలు తగ్గిస్తాం తప్ప పెంచబోమనే ప్రచారాన్ని ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తొమ్మిది నెలల్లోనే విద్యుత్ వినియోగదారులు చుక్కలు చూస్తున్నారు. సామాన్య ప్రజలు మొదలు అన్ని వర్గాల వారిపై మోపిన విద్యుత్ చార్జీల భారం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మొదటి ఏడాదిలోనే విద్యుత్ చార్జీల భారం ఈ స్థాయిలో ఉంటే, రానున్న నాలుగేళ్లలో పరిస్థితి ఊహించుకుంటేనే షాక్ కొడుతోంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నా.. ఒక్కరోజు ఆలస్యమైతే చాలు సర్‌చార్జీ పేరిట జరిమానా విధిస్తున్నారు. మళ్లీ సర్దుబాటు తదితర పేర్లతో 2022, 2023 సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్‌కు కూడా నేడు చార్జీ వేస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

కూటమి ప్రభుత్వ 'షాక్' ఇలా

వినియోగదారుడు ఒక నెలలో 125 యూనిట్లు వినియోగిస్తే మొదటి మూడు శ్లాబ్‌ల ప్రకారం బిల్లు రూ.417 వస్తుంది. దీనికి కస్టమర్ చార్జీ రూ.45, ఫిక్స్‌డ్ చార్జీ రూ.20, ఈడీ చార్జీ రూ.7.50 వసూలు చేస్తారు. అన్నీ కలిపి 125 యూనిట్లకు చెల్లించాల్సిన బిల్లు రూ.489.5 మాత్రమే. ఇదే 125 యూనిట్లకు కూటమి ప్రభుత్వం వసూలు చేస్తున్న మొత్తం రూ.850. అంటే బిల్లుపై అదనంగా రూ.361 భారం మోపుతోంది. విద్యుత్ వినియోగం పెరిగే కొద్దీ భారం తడిచి మోపెడవుతుంది.

భారం ఇలా పడుతోంది..

విద్యుత్ చార్జీల భారం వివిధ రూపాల్లో పడుతోంది. 2022, 2023, 2025 సంవత్సరాలకు సంబంధించి సర్దుబాటు పేరుతో ఎఫ్‌పీపీసీఏ వసూలు చేస్తున్నారు. ఆయా సంవత్సరాల్లో నెల వారీగా వినియోగించిన యూనిట్లపై 40 పైసల ప్రకారం భారం పడుతోంది. ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూ అప్ చార్జీలు కూడా వసూలు చేస్తున్నారు. ప్రజలను ఈ చార్జీలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

సగటున ప్రతినెలా రూ.95కోట్లకు పైనే భారం

సంక్షేమ పథకాల ఊసే లేకపోవడం వల్ల ప్రజల్లో నగదు సర్క్యులేషన్ గణనీయంగా తగ్గిపోయింది. మళ్లీ పేదరికం పురుడుపోసుకుంటోంది. ఇప్పటికే ఎన్నికల హామీలను పక్కనపెట్టిన ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల పేరిట అదనపు భారం మోపుతోంది. ఉమ్మడి జిల్లాలో 15.85 లక్షల గృహ విద్యుత్ కలెక్షన్‌లు ఉన్నాయి. ఈ లెక్కన ఒక్కో కనెక్షన్‌కు సగటున రూ.600 అదనపు భారం లెక్కకట్టినా ప్రతి నెలా రూ.95కోట్లకు పైనే ముక్కుపిండి వసూలు చేస్తుండటం గమనార్హం.

రూ.542 అదనపు బిల్లు

ఫిబ్రవరి నెలలో 145 యూనిట్లు వినియోగించాం. విద్యుత్ చార్జీ రూ.537 వచ్చింది. ఫిక్స్‌డ్ చార్జీ రూ.50, కస్టమర్ చార్జీ రూ.50 వేశారు. మామూలుగా అయితే రూ.637 బిల్లు చెల్లించాల్సి ఉంది. అయితే 2022 సంవత్సరం ఫిబ్రవరి నెలకు సంబంధించి ఎఫ్‌పీపీసీఏ రూ.307.07, 2023 సంవత్సరం ఫిబ్రవరి నెల ఎఫ్‌పీపీసీఏ రూ.166.20, 2025 సంవత్సరం ఫిబ్రవరి నెల ఎఫ్‌పీపీసీఏ రూ.59.60, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.8.70 ప్రకారం అదనపు భారం పడింది. మొత్తంగా వచ్చిన బిల్లు రూ.1,179.

- బి.నాగలక్ష్మి, కర్నూలు



NAME B NAGALAKSHMI
USC NO 8312202205064
Aadhar Number XXXXXXXX9520
Mobile Number XXXXXX7333
SECTION CAMPS
Bill Method IrDA
METER NO 6817114
Meter Type IRDA
DTR Code 308113430378
POS DOMESTIC (A)
CAT:LT1 SUB CAT:0 PH :3
CONTRACTED LOAD 5
BILL PERIOD 06.03.25 06.02.25
PRESENT PREVIOUS
MTR STATUS 01 01
KWH 8581.0 8436
KVAH 9768.0 9603
SOLAR 0.0 0
OLD MTR KWH 0
OLD MTR KVAH 0
BILLED UNITS 145.0/165.0
AVERAGE UNITS 145
SOLAR UNITS 0.0
NET UNITS : 145.0
RECORDED M.D : 2.0 MF :1
MIN/ENERGY CHRGS 537.00
FIXED CHARGES 50.00
CUSTOMER CHARGES 50.00
ELECTRICITY DUTY 8.70
FPPCA(Y22 6.8) 307.07
FPPCA(2023 06) 166.20
FPPCA(2025 02) 59.60
INTEREST ON ED 0.00
SURCHARGE 0.00
OTHER CHARGES 0.00
ADJUSTMENTS 0.00
TrueUp Charges(0/36) 0.00
AP GOVT SUBSIDY 0.00
Loss/Gain (+/-) 0.43
BILL AMT Rs.1179.00

గృహ విద్యుత్ వినియోగం శ్లాబ్‌లు ఇలా..

యూనిట్‌లు	వసూలు మొత్తం (రూ॥ల్లో)
30	1.90
31-75	3.76
76-125	4.5
126-225	6
226-400	8.75
401 పైన	9.75

సర్దుబాటు పేరిట భారం తగదు



రెండు మూడేళ్ల క్రితం వినియోగించిన కరెంటుకు కూడా ఇప్పుడు సర్దుబాటు పేరుతో భారం వేయడం తగదు. మేము ఫిబ్రవరిలో 96 యూనిట్ల కరెంటు మాత్రమే వాడాము. ఇందుకు చార్జీ రూ.206, ఫిక్స్‌డ్ చార్జి రూ.10, కస్టమర్ చార్జీ రూ.40 మాత్రమే చెల్లించాల్సి ఉంది. అయితే రూ.520 బిల్లు ఇచ్చారు. 2022–23 సంవత్సరాల్లో వాడిన ప్రతి యూనిట్‌కు నిబంధనల ప్రకారం బిల్లు చెల్లించాం. ఇప్పుడు మళ్లీ అదనపు చార్జీలు వసూలు చేయడం దారుణం.

- గోవిందరాజులు, రాంపురం, తుగ్గలి మండలం

చార్జీలు పెంచమని మోసగించారు



కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు మోసం చేస్తున్నారు. మేము 135 యూనిట్ల విద్యుత్ వాడాము. ఇందుకు రూ.477 చార్జి, ఫిక్స్‌డ్ చార్జి రూ.10, కస్టమర్ చార్జి రూ.40తో కలిపి చెల్లించాల్సి ఉంది. అయితే 2022 బకాయి అని రూ.103, 2023 బకాయి అని రూ.57, తాజా వాడకానికి సంబంధించి రూ.33.50, సర్‌చార్జి రూ.25, ట్రూ అప్ చార్జి రూ.52 భారం వేశారు. మొత్తం 830 బిల్లు చెల్లించాల్సి వచ్చింది. వాడిన వినియోగానికి ఇది రెట్టింపు.

- సగిలే కృష్ణారెడ్డి, లింగాపురం, బండిఆత్మకూరు

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కబర్ది

కర్నూలు(సెంట్రల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ది అన్నారు. ప్రమాదం ఎటునుంచి వచ్చినా తట్టుకోగలిగే సామర్థ్యాన్ని మహిళలు పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి, ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జ్యోత్స్నదేవి, ఎక్సైజ్ కోర్టు సరోజమ్మ హాజరయ్యారు. మహిళా జడ్జీలను సన్మానించారు.

లోక్ అదాలత్‌లో పది వేల కేసుల పరిష్కారం

కర్నూలు (టౌన్): జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పది వేలకు పైగా కేసులు పరిష్కారం జరిగినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 చోట్ల జాతీయ లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసి కక్షిదారుల కేసులు పరిష్కారం చేసినట్లు చెప్పారు. కర్నూలులో 5 బెంచీలు ఏర్పాటు చేసి న్యాయమూర్తులు జి.భూపాల్ రెడ్డి, లక్ష్మీరాజ్యం, జ్యోత్స్నదేవి, ఎం.సరోజనమ్మ, విశ్రాంత న్యాయమూర్తి లక్ష్మీనరసింహారెడ్డి 4,500 కేసులు పరిష్కారం చేశారన్నారు. నంద్యాలలో 1,021, ఆదోనిలో 432, ఆళ్లగడ్డలో 554, ఆలూరులో 291, ఆత్మకూరులో 319, బనగానపల్లెలో 714, డోన్‌లో 630, కోవెలకుంట్లలో 402, నందికొట్కూరులో 266, పత్తికొండలో 427, ఎమ్మిగనూరులో458 కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామన్నారు.

పొట్టేళ్లు 'అ'ధర' హో..



పొట్టేళ్లను కొనేందుకు వచ్చిన ప్రజలు

కోడుమూరు రూరల్: బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చాలామంది ప్రజలు చికెన్‌ను వదిలేసి మటన్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పొట్టేళ్లకు గిరాకీ పెరిగింది. శనివారం కోడుమూరులో జరిగిన సంతలో ఒక్కో పొట్టేలు సైజును బట్టి రూ.10వేల నుంచి రూ.20వేలకు పైగా పలికింది. పొట్టేళ్ల ధరలు భారీగా ఉన్నప్పటికీ ప్రజలు కొనేందుకు ఎగబడ్డారు.

నేడు జూడో ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఆలూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో సంఘం కార్యదర్శి చంద్రయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15, 16 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శశికళ, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తదితరులు

మహిళల ఉత్సవం

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శనివారం ఆదోని పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. భీరలింగేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, కర్నూలు కార్పొరేటర్ గాజుల శ్వేత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళల కోసం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

- ఆదోని టౌన్



శేషవాహనంపై జ్వాలా నరసింహస్వామి




హనుమంత వాహనంపై ప్రహ్లాదవరదస్వామి

హనుమంత వాహనంపై అహోబిలేశుడు

ఆళ్లగడ్డ: అహోబిలేశుడు శనివారం ఎగువలో శేష, చంద్రప్రభ వాహనాల్లో, దిగువలో శ్రీ యోగానృసింహ గరుడ విమానం, హనుమంత వాహనాలపై ఉభయ దేవేరులతో కలసి మందస్మితదరహాస వీచికలతో దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణ నల్లమల పులకించి పోయింది.

మహిళలను ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు



మహిళలకు రుణ చెక్కును పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో ఎంపీ నాగరాజు, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, జేసీ నవ్య తదితర అధికారులు

కర్నూలు(సెంట్రల్): మహిళలను ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శనివారం నగరంలోని ఎమ్మార్సీ కన్వెన్షన్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎంపీ బి.నాగరాజు, ఎమ్మెల్యే విరుపాక్షి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజం, కుటుంబ వ్యవస్థల్లో మహిళ పాత్ర ఎంతో విశిష్టమన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా సెర్ప్ నుంచి రూ.100 కోట్లు, మెప్మా నుంచి రూ.34 కోట్లు, ఎంఎస్‌ఎంఈ ప్రోగ్రామ్ కింద రూ.55 కోట్ల రుణాలను ఇచ్చామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కోసం ఓఎన్‌డీసీ(ఓపెన్ నెట్‌వర్క్‌ఫర్ డిజిటల్ కామర్స్) ప్లాట్ ఫామ్‌తో ఒప్పందం చేసుకున్నామని, ఇందులో ప్రతి మహిళ తాను ఉత్పత్తి చేసిన ఉత్పత్తుల వివరాలను నమోదు చేస్తే మార్కెటింగ్ లభిస్తుందన్నారు. మార్చి 8న ఒక్కటే దాదాపు 6వేల మంది మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం సెర్ప్, మెప్మా, ఎంఎస్‌ఎంఈల రుణాలతో పాటు ర్యాపిడో ప్రోగ్రామ్ కింద 25 మంది మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీలను ప్రదానం చేశారు.

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల చేయూతకు విరివిగా రుణాలు ఇచ్చి స్వయం ఉపాధిలో రాణించేందుకు కృషి చేస్తోందన్నారు.
- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని, కుటుంబ బాధ్యతల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. పొదుపు రుణాలను పొందిన మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు.
- జేసీ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ 1917లో రష్యన్ రెవల్యూషన్స్ సందర్భంగా మహిళల హక్కుల కోసం పోరాడుతున్న నేపథ్యంలో 1922 మార్చి 8వ తేదీన ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ప్రకటించారన్నారు. ఆరోజు నుంచి ప్రతి ఏడాది మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు గుర్తు చేశారు.
- డిప్యూటీ మేయర్ రేణుకా సిద్ధారెడ్డి మాట్లాడుతూ చిన్న తనం నుంచే పిల్లల్లో ఆడ, మగ అన్న తేడా లేకుండా పెంచాలని సూచించారు. మహిళలు, బాలికలను గౌరవించడం నేర్పించినప్పుడే ఉత్తమ సమాజం సాధ్యమన్నారు.

పలువురికి సన్మానం

కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. మెప్మా ద్వారా నలుగురు ప్రేరణ సఖీలకు రూ.50 వేలు ప్రున బహుమతి ఇచ్చి సన్మానించారు. ఆర్పీల్లో మొదటి బహుమతిగా కర్నూలుకు చెందిన ఎస్.పద్మకు రూ.2500, ఎమ్మిగనూరుకు చెందిన బషీర్బాకు రెండో బహుమతిగా రూ.1500, కర్నూలుకు చెందిన జి.శోభారాణికి మూడో బహుమతిగా రూ.1000 కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం చైర్మన్ బొజ్జమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరక్టర్ సంజమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, మెప్మా పీడీ నాగశివలీల, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి అరుణ, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

జిల్లా రచయితలకు జాతీయ సాహితీ పురస్కారాలు

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత, బాలసాహితీ వేత్త, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ ఎం. హరికిషన్, ప్రముఖ రచయిత, అధ్యాపకులు డాక్టర్ స్వరూప్ సిన్హాలు శనివారం ప్రొద్దుటూరులో జాతీయ సాహితీ పురస్కారాలు అందుకున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళా వేదిక సంయుక్తంగా జాతీయ కథల పుస్తకాల పోటీలను నిర్వహించి ఉత్తమ రచనలు చేసిన రచయితలకు పురస్కారాలు అందజేశారు. కథా రచయిత హరికిషన్ రచించిన 'చిలకముక్కు చిన్నోడు' రచయిత డాక్టర్ స్వరూప్ సిన్హా రచించిన 'నాతో స్నేహం చెయ్యవూ, 'కవిత కావాలి అమృత ధార' రచనలు పురస్కారాలకు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకుడు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, ప్రముఖ బాల సాహితీ వేత్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువుల బాబు చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు.

చంద్రబాబు సృష్టించిన సంపద అప్పులే!

- ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి వెల్లడి



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు(టౌన్): గత ప్రభుత్వంపై నిత్యం విమర్శలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి 9 నెలల వ్యవధిలోనే రూ.1.39 లక్షల కోట్ల అప్పు చేశారని, ఇదే ఆయన సృష్టించిన సంపద అని ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి ఎలాగైన రావాలన్న ఉద్దేశంతో ప్రజలకు లేనిపోని హామీలన్ని చంద్రబాబు ప్రకటించారన్నారు. ఇప్పుడేమో నిధులు లేవంటూ ఉన్నారన్నారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా.. అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే ఆరోగ్య శ్రీ, 108 అంబులెన్స్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎన్టీఆర్ అంటే రూ. 2 కిలో బియ్యం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంటే అమ్మ ఒడి, రైతు భరోసా.. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు తన హయాంలో ప్రజలకు చేసిన ఒక్క మంచి పథకం పేరు చెప్పాలన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలను ప్రజలు క్షమించబోరన్నారు.

ఆలూరును పట్టించుకోని ప్రభుత్వం

ఆలూరు నియోజకవర్గాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి ఆరోపించారు. ఆస్పరి మండలంలో మంచి నీళ్ల లేక గ్రామ ప్రజలు వలసలు వెళుతున్నారని, ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా దృష్టికి తీసుకువచ్చామన్నారు. రాయలసీమ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

క్లుప్తంగా

ఏఈఓల సంఘం జిల్లా కోశాధికారిగా నరసింహుడు



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం(ఏఈఓలు) కోశాధికారిగా వి.నరసింహుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖాళీగా ఉన్న ఈ పోస్టు భర్తీకి శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మంత్రాలయం మండలంలో ఏఈఓగా పని చేస్తున్న నరసింహుడుని కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికకు పరిశీలకుడిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాగేశ్వరరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు చాంద్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

కొలనుభారతి దేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొత్తపల్లి: రాష్ట్రంలో ఏకైక సరస్వతి క్షేత్రంగా విరాజిల్లుతున్న కొలనుభారతి దేవి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహామంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లోక కల్యాణం, ప్రజలు పాడి పంటలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రధాన అర్చకుడు గంట్యాల శ్రీనివాస శర్మ సరస్వతి హోమం నిర్వహించారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన శివరామ్

పగిడ్యాల: తండ్రి బైక్ కొనివ్వనందుకు ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్త ముచ్చుమర్రి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లుది నిరుపేద కుటుంబం. వ్యవసాయ పనుల కెళ్తూ జీవనం సాగించే ఇతనికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శివరామ్ (21) బోలెరో వాహనానికి డ్రైవర్‌గా వెళ్తున్నాడు. కొద్ది రోజుల నుంచి తనకు బైక్ కొనివ్వాలని తండ్రిని వేధించేవాడు. శుక్రవారం రాత్రి తండ్రితో గొడవపడి ఆవేశంతో ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఉరికి వేలాడుతున్న యువకుడిని కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

సాంకేతిక విద్య.. ఉజ్వల భవిత

- పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఏప్రిల్ 30న పాలిసెట్



చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ఉన్నత చదువులు రోజు రోజుకు భారమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో పేద విద్యార్థులు సాంకేతిక విద్య వైపు అడుగులు వేస్తే భవిష్యత్ బంగారు బాట అవుతుంది. పాలిటెక్నిక్ ప్రవేశం ద్వారా తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య పూర్తి చేసి ఆ తర్వాత దాని పునాదిగా చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు. పదో తరగతి ఉత్తీర్ణతతో సాంకేతిక విద్యకు పునాది వేసే 'పాలిసెట్'కు సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందుగానే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకుని జిల్లాలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చు. గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి ఉన్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. అటువంటి వారికి పాలిటెక్నిక్ కోర్సులు చక్కని వేదికలని పలువురు సాంకేతిక విషయ నిపుణులు పేర్కొంటున్నారు. పాలిసెట్–2025 కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దరఖాస్తుల తుది గడువు ప్రకటించలేదు.

కోర్సులు ఇలా...

ప్రస్తుతం సరికొత్త కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందుబాటులోకి తెచ్చాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పలు చోట్ల ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచ్‌కు 60 నుంచి 120 వరకూ సీట్లు ఉన్నాయి. నంద్యాల జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉండగా, జిల్లా వ్యాప్తంగా మరో ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ 30, మెకానికల్ 30 సీట్లు ఉన్నాయి. ఐదు ప్రైవేట్ కళాశాలల్లో సుమారు 1,500 వరకు సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుల కాల వ్యవధి మూడేళ్లు. ఇందులో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రెన్స్‌లో క్వాలిఫై మార్కులు 35గా నిర్ణయించారు. ఏప్రిల్ 30వ తేదీన పాలిసెట్ పరీక్ష నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ప్రయోజనాలెన్నో..

పాలిటెక్నిక్‌లో ఏ కోర్సును పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా లభిస్తుంది. ఈ కళాశాలల్లో ఇటీవల తరచూ ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడేళ్లకు కేవలం రూ.13 వేలు ఖర్చు అవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ సెకండియర్‌లో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చదువుకునేందుకు ఉపకరించే పాలిసెట్–2025కు దరఖాస్తు చేసుకోవాలి. పాలిటెక్నిక్ చదివితే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు, సంబంధిత మెటీరియల్ ఉచితంగా సరఫరా చేస్తున్నాం. – శ్రీనివాసప్రసాద్, పాలిసెట్ జిల్లా కన్వీనర్, నంద్యాల

పాలిసెట్ ఎంట్రెన్స్ ఇలా..

పాలిసెట్ ఎంట్రెన్స్‌ను 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు పరీక్ష ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తారు. ఎగ్జామ్ ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400గా నిర్ణయించారు.

చూపును హరించే 'గ్లకోమా'

- జిల్లాలో అధికమవుతున్న కేసులు
- నేటి నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు





కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి. వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కంటి అద్దాలను తరచూ మార్చాల్సి రావడం.. మసక వెలుతురులో వస్తువులను గుర్తించడం ఆలస్యం అవడం.. లైట్ల చుట్టూ రంగుల వలయాలు కనిపించడం.. ఇలా ఎన్నో లక్షణాలు గ్లకోమా వ్యాధిలో భాగంగా ఉంటాయి. ఈ వ్యాధికి ప్రాథమిక దశలో చికిత్స తీసుకుంటే చూపును కాపాడుకోవచ్చు. ఆలస్యం చేస్తే మాత్రం అంధకారమే మిగులుతుంది. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహించనున్నారు.

పెరుగుతున్న బాధితులు

కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, నంద్యాల కంటి ఆసుపత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో కంటి సమస్యలకు చికిత్స చేస్తారు. గతంలో 2 శాతం వరకు గ్లకోమా బాధితులు ఉంటున్నారు. ప్రస్తుతం వీరి సంఖ్య పెరిగింది. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ప్రతి రోజూ 250 నుంచి 300 మంది దాకా చికిత్స కోసం వస్తుండగా అందులో గ్లకోమా బాధితులు 5 నుంచి 10 మంది దాకా ఉంటున్నారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. చికిత్స కోసం వచ్చిన వైద్యులు అవగాహన కల్పించనున్నారు.

చికిత్స ఇలా..

గ్లకోమాకు శాశ్వత చికిత్స లేదని, మందులతో వ్యాధిని అదుపు చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. కొందరికి లేజర్ చికిత్స చేయవచ్చు. అలాగే శస్త్రచికిత్సతో చూపును కాపాడుకోవచ్చు. సాధారణ ఆంగిల్ క్లోజర్ గ్లకోమా చికిత్సలో డాక్టర్ లేజర్‌ను ఉపయోగించి ద్రవం ప్రవహించడానికి మరో మార్గం తయారు చేస్తారు. కానీ బాగా ముదిరిన దశలో రోగికి మందులు, శస్త్రచికిత్సల అవసరం ఉంటుంది.

వారోత్సవాలు ఎక్కడంటే..

గ్లకోమాపై ఆదివారం అవగాహన వారోత్సవాల ప్రారంభం కార్యక్రమాన్ని కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ ఎం. సంధ్యారెడ్డితో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10వ తేదీన పడిగిరాయి పీహెచ్‌సీలో, 11న వాక్‌థాన్, 12న పోలకల్ పీహెచ్‌సీలో, 13న కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో, 14న హర్దగేరి పీహెచ్‌సీలో, 15న కంటి ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్లకోమాకు కంటి ఆసుపత్రిలో ప్రతిరోజూ ప్రత్యేకమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కంటి వైద్యులు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'యువత పోరు బాట'ను విజయవంతం చేద్దాం

- జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి

బనగానపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో నిర్వహించే 'యువత పోరు బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బనగానపల్లెలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇంత వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఏటా డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి హామీలు చేయకపోవడంతో యువత మోసపోయిందన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పి మహిళలను దగా చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఎంతో మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని విమర్శించారు. 2014–19 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.3,200 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఈనెల 12న చేపట్టే యువత పోరు బాట కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అదే రోజు ముందుగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం బనగానపల్లె, కోవెలకుంట్ల సంజామల, మండలాల అధ్యక్షులు తూర్పింటి శ్రీనివాసరెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, తోట వెంకటేశ్వరరెడ్డి, కోవెలకుంట్ల వాణిజ్య విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవ్వించిన 'కుట్టిదరే కుట్టమ్మ'

కామన్న వేడుకల్లో భాగంగా శనివారం పాడిన 'కుట్టిదరే కుట్టమ్మ' అనే పాట అందరినీ నవ్వించింది. హొళగుంద విరక్త మఠం పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు ఆడ వేషాలు ధరించి రోకలిబండలు పట్టుకుని వీధుల్లో పాట పాడుతూ వెళ్లారు. హాస్య సన్నివేశాలను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. ఆఖరి రోజు రాక్షసుడి దహనం, రతీమన్మథుల వివాహం, పెళ్లి ఊరేగింపు ఇతర సన్నివేశాలతో ముగింపు ఉంటుందని విరక్త మఠం యువకులు తెలిపారు. – హొళగుంద

నాణ్యమైన విద్యకు చిరునామా 'బనవాసి ఏపీఆర్‌జేసీ'

దరఖాస్తుకు ఈ నెల 31 ఆఖరు

- ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష
- నాలుగు జిల్లాల విద్యార్థినులకు అవకాశం



బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ

ఎమ్మిగనూరు రూరల్: బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ క్రమ శిక్షణకు, నాణ్యమైన విద్యా బోధనకు పెట్టింది పేరు. కాలేజీలో సీటు రావటం విద్యార్థినులు అదృష్టంగా భావిస్తారు. ఏపీ గురుకుల కాలేజీలో చదువుకున్న విద్యార్థిని ఉన్నత విద్యలో రాణిస్తుందనే నమ్మకం. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన విద్యార్థినులకు ఇక్కడ రెండు సంవత్సరాల విద్యాబోధన అందుతుంది. ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే సీటు వచ్చినట్లే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, క్రీడాకారులు, అనాథలు, ఎన్‌సీసీ కేడెట్లకు రిజర్వేషన్ వర్తిస్తుంది. సీటు దక్కించుకున్న విద్యార్థినులకు హాస్టల్ వసతి కూడా ఉంటుంది. కాలేజీలో బాలికలకు ఎంపీసీలో 60 సీట్లు, బైపీసీలో 40 సీట్లు, ఎంఈసీలో 30 సీట్లు ఉంటాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు:

ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదో తరగతి విద్యార్థినీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు https//aprs.apcfss.in వెబ్‌సైట్‌ను చూడవచ్చును. ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే.. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న (మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల) నిర్వహిస్తారు.

బాలికలకు మంచి అవకాశం



రాయలసీమలోని నాలుగు జిల్లా విద్యార్థినులకు ఇది మంచి అవకాశం. కాలేజీలో సీటు వస్తే రెండు సంవత్సరాలు బోధన అందిస్తాం. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– వి.గీర్వాణి, జిల్లా కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఏజీఆర్‌జేసీ బనవాసి

వైఎస్సార్‌సీపీ విభాగాల్లో పలువురికి చోటు

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు లభించింది. ఈ మేరకు శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర స్థాయి అనుబంధ విభాగాల్లో ఒకరికి, జోనల్ స్థాయి మహిళా విభాగంలో ఇద్దరికి, బీసీ సెల్ విభాగంలో ఐదుగురికి, వాణిజ్య విభాగంలో ముగ్గురికి, మేధావుల ఫోరం విభాగాల్లో ముగ్గురికి పదవులు వచ్చాయి.

పేరు	పార్టీలో హోదా
గాజుల శ్వేతా రెడ్డి	రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షులు
కల్లా నాగవేణి రెడ్డి	రాష్ట్రమహిళా విభాగం ప్రధాన కార్యదర్శి
ఆర్‌ఎం. జులేఖా బీ	రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి
జె. సోమశేఖర్	రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి
బావనపల్లి భారతి	రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి
గొల్ల విరూపాక్షి	రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి
ఎస్. కృష్ణయ్య	రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి
కె. నాగేష్	రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి
వై. రాజశేఖర్ రెడ్డి	రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి
రెడ్డిగారి ప్రమోద్ రెడ్డి	రాష్ట్ర వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి
జి. షరీఫ్ అహమ్మద్	రాష్ట్ర వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి
సి. శ్రీనివాసులు	రాష్ట్ర మేధావుల ఫోరం అధికార ప్రతినిధి
కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి	రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి
దేవపూజ ధనుంజయ ఆచారి	రాష్ట్ర మేధావుల ఫోరమ్ సంయుక్త కార్యదర్శి

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: బెలుం శింగవరంలో భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిందితుడి వివరాలను విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించారు. గ్రామానికి చెందిన బిజ్జం చిన్న వెంకట్రామిరెడ్డి, మనోహరమ్మ దంపతులు వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగించేవారు. కాగా చిన్న వెంకట్రామిరెడ్డి మద్యానికి బానిస కావడం, ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పర్చుకుని ఆస్తులతో పాటు డబ్బులు పోగొట్టుకున్నాడు. పూర్తిగా మద్యానికి బానిసై పనికి పోకుండా ఖాళీగా ఉంటూ భార్యతో గొడవ పడేవాడు. మనోహరమ్మ కూలీ పనుల ద్వారా వచ్చిన డబ్బుల కోసం ఘర్షణ పడి లాక్కునేవాడు. పైగా భార్యపై రోజు రోజుకు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 6వ తేదీన కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన భార్యను రోకలి బండతో బలంగా కొట్టడంతో దుర్మరణం చెందింది. మృతురాలి తండ్రి గడ్డం తిమ్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

తండ్రి మృతి.. తనయుడికి గాయాలు

- బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు ఎల్లస్వామి



ఎల్ల మద్దిలేటి (ఫైల్)

కల్లూరు/ వెల్దుర్తి: బైక్‌ను గుర్తుతెలియన వాహనం ఢీకొనడంతో తండ్రి మృతి చెందగా తనయకుడికి గాయలయ్యాయి. కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద హైవే 44పై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెల్దుర్తి ఎల్లమ్మ గుడి పూజారి అయిన ఎల్లమద్దిలేటి టైలర్ పని చేస్తూ తన కుమారుడు ఎల్లస్వామిని బీటెక్ చదివిస్తున్నారు. కుమారుడితో కలిసి బైక్‌పై వెల్దుర్తి నుంచి కర్నూలుకు ఆరోగ్య పరీక్షల నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా చిన్నటేకూరు సమీపంలో గుర్తుతెలియన వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలుకొట్టింది. బైక్ వెనుక కూర్చున్న తండ్రి ఎల్లమద్దిలేటి రోడ్డుపై పడ్డి తీవ్ర రక్తగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న ఎల్లస్వామి స్వల్పగాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఉలిందకొండ పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటనా ప్రాంతంలో తండ్రి మృతదేహం వద్ద కుమారుడి రోదన కంట తడి పెట్టించింది. మృతునికి భార్య లక్ష్మిదేవి, కుమారుడు, డిగ్రీ చదువుతున్న కుమార్తె ఉన్నారు.